క్లుప్తంగా

నేడు ఎంపీ మాగుంట రాక

ఒంగోలు: ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి శని, ఆదివారాల్లో ఒంగోలులో జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొంటారని మాగుంట కార్యాలయ ప్రతినిధి భవనం సుబ్బారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం సాయంత్రం 5.30 గంటలకు ఒంగోలులోని రాంనగర్ రెండోలైన్‌లో గల మాగుంట కార్యాలయంలో ప్రజలు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు అందుబాటులో ఉంటారని చెప్పారు. ఆదివారం మాగుంట జన్మదినం సందర్భంగా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు ఆయన కార్యాలయంలో అభిమానులు నిర్వహించే వేడుకల్లో పాల్గొంటారని తెలిపారు. అందరూ హాజరై జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

నేడు నాగార్జున డిగ్రీ కాలేజీలో క్యాంపస్ ఇంటర్వ్యూలు

ఒంగోలు: స్థానిక మంగమూరు రోడ్డులోని బైపాస్ జంక్షన్‌లో ప్రముఖ మల్టీనేషనల్ కంపెనీ అయిన పై ఇన్ఫోకామ్ ప్రైవేటు లిమిటెడ్ లక్నో వారిచే శనివారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు కాలేజీ చైర్మన్ వి.రాంప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ డ్రైవ్‌కు 2022-23లో డిగ్రీ పూర్తిచేసినవారు, ప్రస్తుతం డిగ్రీ/బీటెక్/ఎంబీఏ పూర్తిచేసిన వారు అర్హులని తెలిపారు. ఇంటర్వ్యూకు హాజరయ్యే ప్రతి విద్యార్థి తప్పనిసరిగా రెజ్యూమ్‌తో రావాలన్నారు. ప్రతి ఒక్క విద్యార్థి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కుటుంబానికి ఆర్థిక సాయం

చీమకుర్తి: తల్లిదండ్రులను కోల్పోయిన ఓ కుటుంబానికి నిస్సీ పాస్టర్ యూనియన్ ప్రెసిడెంట్ విలియమ్స్ శుక్రవారం రూ.5 వేల ఆర్థిక సాయం అందించారు. సంతనూతలపాడు మండలం తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన ప్రేముల కరుణమ్మ మృతి చెందింది. గతంలో ఆమె భర్త కూడా మృతి చెందాడు. వారి కుమారుడు నాగార్జున కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు.

'చదవడం మాకిష్టం'ను విజయవంతం చేయాలి

కొత్తపట్నం: స్థానిక గ్రంథాలయంలో ఈ నెల 15 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించనున్న చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని గ్రంథపాలకుడు సీహెచ్ అజయ్‌బాబు తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగే ఈ కార్యక్రమంలో విద్యార్థులకు కథలు చెప్పడం, పుస్తక పఠనం, వివిధ రకాల వ్యాసరచన పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఉల్లాసవంతమైన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. విద్యార్థులు దసరా సెలవులను ఉపయోగించుకుని విజ్ఞానాన్ని పొందాలని కోరారు.

అగ్నిప్రమాద బాధితులకు రెడ్‌క్రాస్ సాయం



అగ్ని ప్రమాద బాధితులకు సాయం అందజేస్తున్న రెడ్‌క్రాస్ సభ్యులు

ఒంగోలు టౌన్: నగరంలోని అగ్రహారం వద్ద దత్తాత్రేయకాలనీలో జరిగిన అగ్నిప్రమాద బాధితులకు శుక్రవారం రెడ్‌క్రాస్ సాయం అందించింది. రెడ్‌క్రాస్ అధ్యక్షులు, కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ ఆదేశాల మేరకు వంటసామగ్రి, టార్పాలిన్ షీట్లు, హైజీన్ కిట్లు అందజేశారు. ఇళ్ల పునర్నిర్మించేందుకు త్వరలోనే మరింత సహాయం అందజేస్తామని రెడ్‌క్రాస్ చైర్మన్ మాంటిసోరి ప్రకాష్ తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ డాక్టర్ వెంకటేశ్వరరెడ్డి, సభ్యుడు, శివం ఫౌండేషన్ శ్రీహరి, క్షేత్రాధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రిమ్స్ పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఒంగోలు టౌన్: రిమ్స్‌లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శుక్రవారం రిమ్స్ ఎదుట కార్మికులు నిర్వహించిన ధర్నాలో పాల్గొని మాట్లాడారు. కార్మికులకు జీతాలు పెంచాలని కోరారు. పలువురు నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత

ఒంగోలు సబర్బన్: నగరంలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఒంగోలు నగర డీఈఈ వినయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. విద్యుత్ సబ్‌స్టేషన్లు, విద్యుత్ లైన్లలో మరమ్మతుల కారణంగా విద్యుత్ డి-1 సబ్‌స్టేషన్ పరిధిలోని కోర్టు సెంటర్, రాజాపానగల్‌రోడ్డు, ఏనుగు చెట్టు, తిరువెంగళంపల్లివారివీధి, గాంధీరోడ్డు, దక్షిణం బజారు, పప్పు బజారు, తాతా కళ్యాణ మండపం, బీఎస్ఎన్ఎల్ ఆఫీసు ప్రాంతాల్లో మరమ్మతులు జరుగుతున్నాయన్నారు. అందులో భాగంగా ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. నగరంలోని డీ-4 విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ద్వారకా నగర్, శ్రీరామ్‌కాలనీ, పీర్లమాన్యం, సమతానగర్, ఆంధ్రకేసరి నగర్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గోపాల్‌నగర్ అన్ని లైన్లు, గోపాల్ నగర్ ఎక్స్‌టెన్షన్ అన్ని లైన్లలోనూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని వివరించారు.

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి లక్ష్యం

- సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు



దొడ్డవరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు

మద్దిపాడు: ఆంధ్రప్రదేశ్‌ను సంపూర్ణ ఆరోగ్యంగా మార్చడం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రమిస్తున్నారని సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు అన్నారు. మండలంలోని దొడ్డవరం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజల ఆరోగ్యం కోసం పలు రకాల పథకాలు, కార్యక్రమాలను సీఎం అమలు చేస్తున్నారని కొనియాడారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ప్రజల నుంచి విపరీతమైన స్పందన లభిస్తోందని తెలిపారు. ప్రతి గ్రామంలో వందల సంఖ్యలో రోగులు హాజరై స్పెషలిస్ట్ డాక్టర్లతో చూపించుకుంటున్నారని చెప్పారు. రెండేళ్లుగా ఎమ్మెల్యేలను గడపగడపకు పంపిస్తూ అర్హులందరికీ అన్ని పథకాలు అందేలా సీఎం చర్యలు చేపట్టారని గుర్తుచేశారు. నియోజకవర్గంలోని 91 వేల గడపలను సంవత్సరం ఆరు నెలల పాటు తాను అవిశ్రాంతంగా తిరిగి సందర్శించినట్లు తెలిపారు. ఇటువంటి ముఖ్యమంత్రికి ప్రజలంతా మద్దతు తెలపాల్సిన సమయం ఆసన్నమైందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రతిపక్షం గురించి మాట్లాడబోతూ.. ప్రస్తుతం మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు గురించి మాట్లాడుకోవడం అనవసరమని, సమయం వృథా చేసుకోకుండా మన పనులు మనం చేసుకుంటే చట్టం తన పని తాను చేసుకుపోతుందని అన్నారు. మెడికల్ డిపార్ట్‌మెంట్ డీసీహెచ్ఎస్ ఎస్ఎస్ మూర్తి, జిల్లా జగనన్న ఆరోగ్య సురక్ష నోడల్ ఆఫీసర్ డాక్టర్ వేణుగోపాలరెడ్డి వైద్య శిబిరాన్ని పరిశీలించారు. ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి, వైస్ ఎంపీపీ పైడిపాటి వెంకట్రావు, నాయకులు మోరబోయిన సంజీవరావు గుడ్డపాతల రవి, విల్సన్, రాయపాటి రమేష్, తేళ్ల పుల్లారావు, జిల్లా సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు బెజవాడ రాము, జేసీఎస్ కన్వీనర్ బత్తుల శ్రీనివాసరావు, ఉన్నం ప్రశీద, సన్నపురెడ్డి రమణమ్మ, సర్పంచ్ బొమ్మల రామాంజనేయులు, గ్రామ సర్పంచ్ సుబ్బారావు, ఎంపీటీసీ పద్మ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

గుండమాలలో 432 మందికి వైద్య పరీక్షలు...



గుండమాలలో మాట్లాడుతున్న వీరయ్యచౌదరి

గుండమాల (కొత్తపట్నం): గుండమాల గ్రామంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ మన్నె వీరయ్యచౌదరి ప్రారంభించగా, సర్పంచ్ కారాని జయరావు అధ్యక్షత వహించారు. 432 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం కళ్లజోళ్లు, ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్లు, ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత, డిప్యూటీ తహసీల్దార్ అర్జున్‌రెడ్డి, ఈవోఆర్డీ ఏ బాలచెన్నయ్య, యూడీసీ కూచిపూడి శరత్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

మంగమూరులో...



మంగమూరులో వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ, కన్వీనర్

చీమకుర్తి: మంగమూరు గ్రామంలో శుక్రవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, ఎంపీపీ బీ విజయ, జెడ్పీటీసీ దుంపా రమణమ్మ ప్రారంభించారు. పలువురు డాక్టర్లు పాల్గొని రోగులకు వైద్యపరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు.

నాయుడుపాలెంలో...



నాయుడుపాలెంలో రోగులకు మందులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ, కన్వీనర్

చీమకుర్తి మండలం పీ నాయుడుపాలెం గ్రామంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు ప్రారంభించారు. డాక్టర్లు పాల్గొని రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ బొంతా కరుణప్రియ, ఎంపీటీసీ కూడలి అంజలి, నాయకులు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ భవన స్థలానికి రక్షణ కల్పిస్తాం

- ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి హామీ



బాలినేనికి వినతిపత్రం అందిస్తున్న మాదిగ సంక్షేమ పోరాట సమితి నాయకులు

ఒంగోలు: బాబూ జగ్జీవన్‌రామ్ భవనానికి కేటాయించిన స్థలానికి రక్షణ కల్పిస్తామని ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు. స్థానిక ఎన్ఎస్‌పీ అతిథి గృహంలో మాదిగసంక్షేమ పోరాట సమితి, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి, దళిత సంఘాల నాయకులు శుక్రవారం బాలినేనిని కలిశారు. ఈ సందర్భంగా బాలినేని స్పందిస్తూ జగ్జీవన్‌రామ్ భవనానికి చెందిన స్థలానికి తప్పనిసరిగా నిధులు కేటాయిస్తామని, దానిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతానని అన్నారు. భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసి నిర్మాణం చేపట్టే విధంగా కూడా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. స్థలానికి సంబంధించిన ఉత్తర్వులు కూడా ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సుజన్ మాదిగతో పాటు మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా కన్వీనర్ తోరటి ఆనంద్‌మాదిగ, ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

మట్టి కలశ యాత్రను ప్రారంభించిన మేయర్



ప్రతిజ్ఞ చేయిస్తున్న మేయర్ గంగాడ సుజాత

ఒంగోలు సబర్బన్: స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం మేరీ మట్టి మేరీ దేశ్ కార్యక్రమం నిర్వహించారు. ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మిట్టీకో నమన్...వీరాన్ కా వందన్ అమృత కలశ యాత్ర నిర్వహించారు. మేయర్ మాట్లాడుతూ ఒంగోలు నగరంలోని 70 వార్డు సచివాలయాల నుంచి మట్టి సేకరించి తెప్పించామన్నారు. మొత్తం మట్టిని కలశాలలో నింపి ఢిల్లీలోని ప్రధానమంత్రి నరేంద్ర మోదీజీకి పంపిస్తున్నామని తెలిపారు. మట్టి కలశాలు పంపించే కార్యక్రమం సెప్టెంబర్ 1 నుంచి అక్టోబర్ 31 వరకు జరుగుతోందని మేయర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా నగర పాలక సంస్థ అధికారులు, సిబ్బందితో మన మట్టిని మన దేశాన్ని కాపాడుకోవాలని ప్రతిజ్ఞ చేయించారు. కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, డిప్యూటీ మేయర్ వెలనాటి మాధవరావు, డీఈ గణపతి, పద్మజ, తదితరులు పాల్గొన్నారు.

కలశ యాత్ర నిర్వహించిన క్విజ్ కళాశాల విద్యార్థులు...

ఒంగోలు సెంట్రల్: మేరీ మాతి మేరా దేశ్ అమృత్ కలశ యాత్రను క్విజ్ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థులు శుక్రవారం వెంగముక్కపాలెం, యరజర్ల గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. క్విజ్ కాలేజీ అమృత కలశ యాత్ర దత్తత గ్రామాలైన రెండు గ్రామాల్లో విద్యార్థులు ర్యాలీ నిర్వహించి మట్టి సేకరించారు. కళాశాల చైర్మన్ డాక్టర్ ఎన్.సూర్యకళ్యాణ్, వైస్ చైర్మన్ డాక్టర్ ఎన్.గాయత్రి, ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీ హనుమంతరావు, ఎన్ఎస్ఎస్ హెడ్ డాక్టర్ నవనీతకృష్ణన్, పీఓలు, యువజన అధికారులు పాల్గొన్నారు.

ప్రలోభాలకు గురిచేస్తే కఠిన చర్యలు

- జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ భగవాన్ నాయక్ హెచ్చరిక



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.భగవాన్ నాయక్

ఒంగోలు టౌన్: ఒంగోలు సర్వజన ఆస్పత్రికి చికిత్స కోసం వచ్చే రోగులను కానీ, హాస్పిటల్ సిబ్బందిని కానీ బయటి వ్యక్తుల ఎవరైనా ప్రలోభాలకు గురి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ భగవాన్ నాయక్ హెచ్చరించారు. శుక్రవారం జీజీహెచ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జీజీహెచ్‌లో అన్నిరకాల చికిత్సలు అందించేందుకు తగిన సౌకర్యాలను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ఆధునాతన వైద్యపరికరాలతో నిబద్ధత కలిగిన సిబ్బంది అహర్నిశలు వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నారని చెప్పారు. ఇటీవల కొంతమంది బయట వ్యక్తులు రోగులను, వారి సహాయకులు కుటుంబ సభ్యులకు మాయమాటలు చెప్పి ప్రలోభాలకు గురిచేస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందని, ఇలాంటి వారిని ఉపేక్షించేది లేదని, వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధునాతన వైద్య పరికరాలను సమకూర్చడమే కాకుండా అన్నీ రకాల వైద్య పరీక్షలను ప్రజలందరికీ అందుబాటులోకి తెచ్చిందని వివరించారు. గతంలో సిబ్బంది కొరత ఉన్నా ప్రస్తుత ప్రభుత్వం అవసరమైన సిబ్బందిని నియమించిందని చెప్పారు. కార్పొరేట్ ఆస్పత్రులకు ఏమాత్రం తీసిపోకుండా అనుభవజ్ఞులైన వైద్యులచేత నాణ్యమైన చికిత్స చేస్తారన్నారు. ఎంతటి అత్యవసర పరిస్థితిలో వచ్చినా సరే చికిత్స చేస్తారని తెలిపారు. ప్రభుత్వ వైద్యశాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. జీజీహెచ్‌లో అందుతున్న వైద్యంపై ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని, బయట వ్యక్తులు చెప్పే మాటలను నమ్మవద్దని డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ అనిల్ చెప్పారు. ఏదైనా సమస్య ఉంటే వెంటనే సూపరింటెండెంట్, ఆర్ఎంఓల దృష్టికి తీసుకొని రావాలని సూచించారు. జీజీహెచ్‌లో ఆరోగ్య శ్రీ, ఈహెచ్ఎస్ వంటి సౌకర్యాలు ఉన్నాయని తెలిపారు. ఒకవేళ ఎవరికైనా మరింత మెరుగైన వైద్యం అవసరమైతే గుంటూరు, విజయవాడ జీజీహెచ్‌లకు పంపుతారని, ప్రైవేటు వైద్యశాలలకు పంపించే అవసరం రాదని స్పష్టం చేశారు. జీజీహెచ్‌లో అన్ని రకాల సౌకర్యాలు ఉన్నాయని, మధ్య దళారులు, ప్రైవేటు ఆస్పత్రుల పీఆర్వోల మాటలు నమ్మవద్దన్నారు. త్వరలోనే వైద్యశాలలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేస్తామన్నారు.

కార్యకర్తకు బాలినేని ప్రణీత్‌రెడ్డి నివాళులు



నివాళులర్పిస్తున్న బాలినేని ప్రణీత్‌రెడ్డి

ఒంగోలు: స్థానిక నెహ్రూనగర్‌లో నివాసం ఉండే వైఎస్సార్ సీపీ కార్యకర్త షేక్ రసూల్ అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ యువనేత బాలినేని ప్రణీత్‌రెడ్డి వెళ్లి రసూల్ భౌతిక కాయానికి నివాళులర్పించారు. వారి కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

ఆర్టీసీ ఎ.యూ ఒంగోలు డిపో కమిటీ ఎంపిక

ఒంగోలు: ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ ఒంగోలు డిపో నూతన కమిటీని స్థానిక ఎన్టీఆర్ కళాక్షేత్రంలో శుక్రవారం ఎంపిక చేశారు. చైర్మన్‌గా జి.నాగరాజు, అధ్యక్షునిగా ఎం.వెంకట్రావు, కార్యదర్శిగా జి.మాధవరావు, సంయుక్త కార్యదర్శులుగా ఆర్‌పీసీ కళాధర్, ఏజేజే కుమార్, నక్కల శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా ఎం.నాగులు, జీఏఎస్ రావు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా పి.నరేంద్ర, అసిస్టెంట్ సెక్రటరీలుగా ఎస్.కృష్ణ, ఎం.ప్రసాద్‌తో పాటు మరో 15 మందితో నూతన కమిటీని ఎంపిక చేసినట్లు ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు దామోదరరావు ప్రకటించారు. జిల్లా చీఫ్ వైస్ ప్రెసిడెంట్‌గా కె.శ్రీనివాసులను ఎంపిక చేశారు.

జగనన్న ఫౌండేషన్ సేవలను విస్తృతం చేయాలి

- ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి



వారా వీర్రాజు జన్మదిన వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, నాయకులు

ఒంగోలు: జగనన్న ఫౌండేషన్ సేవలను మరింత విస్తృతం చేయాలని ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి సూచించారు. స్థానిక జగనన్న ఫౌండేషన్ కార్యాలయంలో ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు వారా వీర్రాజు పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం నిర్వహించిన వేడుకల్లో బాలినేని ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వారా వీర్రాజు కేక్ కట్ చేయగా, బాలినేని కేక్ తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బాలినేనిని గజమాల, దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నగర నాయకుడు కటారి శంకర్, పొగాకు బోర్డు సభ్యుడు మారెడ్డి సుబ్బారెడ్డి, చీమకుర్తి జెడ్పీటీసీ వేమా శ్రీనివాసులు, ఎంపీటీసీ సిటిజన్ శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చింతగుంట్ల సువర్ణ, మహిళా విభాగం జోనల్ ఇన్‌చార్జి బడుగు ఇందిర, 50వ డివిజన్ కార్పొరేటర్ అంబటి ప్రసాద్, ఉప్పుటూరి శ్రీనివాసరెడ్డి, ఉన్నం శ్రీనివాస్, పి.సుబ్బారావు, గోపిరెడ్డి, వెన్నపూస వెంకటరెడ్డి తదితరులు పాల్గొని వీర్రాజుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ఏఐపై విద్యార్థులకు అవగాహన అవసరం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న గిరిజ

ఒంగోలు: స్థానిక పేస్ ఇంజినీరింగ్ కాలేజీలో విద్యార్థులకు ఇన్ఫోసిస్ స్ప్రింగ్‌బోర్డు ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌పై శుక్రవారం వర్క్‌షాపు నిర్వహించారు. రిసోర్సుపర్సన్‌గా బెంగళూరు ఇన్ఫోసిస్ సీనియర్ ఎనలిస్ట్ టీఆర్ గిరిజ హాజరై మాట్లాడారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్, డీప్ లెర్నింగ్ వంటి సాంకేతిక అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు పరీక్ష నిర్వహించి సర్టిఫికెట్లు అందించారు. ఈ సర్టిఫికెట్లు విద్యార్థులకు ఎంతగానో ఉపాధి అవకాశాలకు దోహదపడతాయన్నారు. కాలేజీ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ మద్దిశెట్టి శ్రీధర్, ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీకే మూర్తి మాట్లాడుతూ ఈ సదస్సుల వలన కలిగే ఉపయోగాలను విద్యార్థులు వినియోగించుకోవాలని సూచించారు.

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు కొత్తపట్నం మండల విద్యార్థులు




రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన ఈతముక్కల హైస్కూల్ విద్యార్థులు



ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన మోటుమాల విద్యార్థులతో ఉపాధ్యాయులు

కొత్తపట్నం: జిల్లాలోని పలు చోట్ల ఇటీవల జరిగిన క్రీడా పోటీల్లో కొత్తపట్నం మండల విద్యార్థులు ప్రతిభచూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. మండలంలోని ఈతముక్కల హైస్కూల్ విద్యార్థి ఎ.మహిమ కుమారి అండర్-14 విభాగం బేస్ బాల్ స్టేట్ మీట్‌కు ఎంపికయ్యారు. అండర్-17లో బి.బ్లెస్సిజాయ్, ఎ.హిమశ్రీ, జె.సాయి రాజేశ్వరి ఎంపికయ్యారు. ఫుట్‌బాల్ అండర్ 14కు బి.కావ్య, బ్లెస్సీజాయ్, అండర్-17కు షేక్ మొబీన ఎంపికయ్యారు. స్విమ్మింగ్ అండర్-17కు ఎం.సాయి, బి.కిషోర్, హైజంప్ అండర్-17కు నాగచైతన్య ఎంపికయ్యారు. సాఫ్ట్‌బాల్ అండర్-14కు బాలగౌరి, ఎం.గణేష్‌రెడ్డి, వాలీబాల్ అండర్ 17కు కె.బాలాజి, కె.నరసింహాద్రి ఎంపికయ్యారు. చెస్ అండర్ 17కు సయ్యద్ మహ్మద్ జహీర్, హాకీ అండర్ 14కు పి.యశస్విని ఎంపికవగా, వారితో పాటు పీడీలు పి.యశోద, దేవేష్టంలను హెచ్ఎం చెంచుపున్నయ్య శుక్రవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో అభినందించారు. ఎస్ఎంసీ అధ్యక్షుడు నారాయణరెడ్డి, క్రీడా సామగ్రి ఇచ్చిన గ్రామస్తులు పొందూరి వెంకటరెడ్డి పాల్గొని సంతోషం వ్యక్తం చేశారు. అదేవిధంగా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి ఆటల పోటీలకు మోటుమాల కేజీబీవీ విద్యార్థినులు ఎంపికైనట్లు ఎస్‌వో అరుణకుమారి తెలిపారు. చదరంగం అండర్ 17లో 10వ తరగతి విద్యార్థిని వి.మీనాక్షి, 9వ తరగతి విద్యార్థిని పి.సంకీర్తన ఎంపికయ్యారు. కబడ్డీ అండర్ 14కు 9వ తరగతి విద్యార్థిని కె.మానస, 8వ తరగతి విద్యార్థిని డి.తేజస్వీ, అండర్ 17కు పదో తరగతి విద్యార్థిని వి.మీనాక్షి, ఎంపికయ్యారు. వారిని పాఠశాల ప్రిన్సిపాల్ వి.అరుణకుమారి, పీఈటీ కె.జ్యోతి, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

ఉప్పుగుండూరు విద్యార్థులు...



నాగులుప్పలపాడు: రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఉప్పుగుండూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్ఎం పుట్టా చలపతిరావు తెలిపారు. సంతనూతలపాడులో జరిగిన జిల్లా స్థాయి కబడ్డీ ఎంపిక పోటీల్లో అండర్-17 విభాగంలో నల్లబోతుల పోలమ్మ, అండర్-14కు కొలకలూరి బ్యూలారాణి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికవగా, శుక్రవారం పాఠశాలలో వారిని అభినందించారు.

ప్రత్యామ్నాయ విధానాలతోనే విద్యారంగం అభివృద్ధి


- ఎమ్మెల్సీ లక్ష్మణరావు



ప్రసంగిస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

ఒంగోలు టౌన్: ప్రత్యామ్నాయ విద్యావిధానాలతోనే విద్యారంగం అభివృద్ధి చెందుతుందని పీడీఎఫ్ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు అన్నారు. శుక్రవారం స్థానిక అంబేడ్కర్‌భవన్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి విద్యా సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. మేధావులకు నిలయాలుగా ఉండాల్సిన విశ్వవిద్యాలయాలు రాజకీయ నాయకుల కేంద్రాలుగా తయారయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. విద్యావసతి, విద్యాదీవెన ఫీజులను సకాలంలో విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చిన పాఠ్యపుస్తకాలను బోధిస్తున్నారని, ఆయా పాఠాల్లో వాస్తవ చరిత్రను వదిలేసి అవాస్తవాలను బోధిస్తున్నారని మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి నియోజకవర్గంలో ఒక ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కేరళ రాష్ట్రంలో అమలులో ఉన్న విద్యా విధానాన్ని ఇక్కడ కూడా అమలు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వై.వెంకటేశ్వర్లు కోరారు. ఇంగ్లిష్, తెలుగు రెండు మాధ్యమాలను సమంగా కొనసాగించాలని మంగమ్మ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ ఏవీ పుల్లారావు సూచించారు. విద్యార్థులకు చదువుతో పాటు ఆటపాటలు నేర్పించాలని, ఎన్నికలు నిర్వహించాలని రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ పేరయ్య కోరారు. అనంతరం పలు తీర్మానాలను ఆమోదించారు. కార్యక్రమంలో విశ్రాంత ఎంఈఓ శేషయ్య, విద్యార్థి సంఘ నాయకులు సీహెచ్ వినోద్, కంకణాల ఆంజనేయులు, రమాదేవి, బి.రఘురాం, బాలకోటయ్య, జి.రమేష్, షేక్ హుసేన్, షేక్ అమీర్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో మెరుగైన వైద్యం




వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

నాగులుప్పలపాడు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా గ్రామాల్లోని ప్రజలకు మెరుగైన వైద్యాన్ని ఉచితంగా అందిస్తున్నట్లు ఎంపీపీ నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ యాదల రత్నభారతి తెలిపారు. మండలంలోని కండ్లగుంట గ్రామంలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని వారు పరిశీలించి మాట్లాడారు. రోగులకు అందుతున్న వైద్యసేవలను పరిశీలించి మందులు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుజన్‌కుమార్, సర్పంచ్ పల్లెర్ల అంజిరెడ్డి, ఎంపీడీవో జయమణి, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల విషయంలో అలసత్వం వీడాలి

ఒంగోలు సబర్బన్: నగరంలో పారిశుధ్య పనుల విషయంలో అలసత్వం వీడకపోతే చర్యలు తప్పవని శానిటరీ అధికారులు, సిబ్బందిపై నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో శుక్రవారం సాయంత్రం శానిటరీ సూపర్‌వైజర్లు, ఇన్‌స్పెక్టర్లు, మేస్త్రీలతో పారిశుధ్య పనులపై సమావేశం నిర్వహించి మాట్లాడారు.

రాయపాటి అంకయ్యకు సన్మానం



రాయపాటి అంకయ్యను సన్మానిస్తున్న నాయకులు

ఒంగోలు రూరల్: వైఎస్సార్ సీపీ ఒంగోలు రూరల్ మండల కన్వీనర్‌గా పనిచేసిన ముక్తినూతలపాడుకు చెందిన రాయపాటి అంకయ్యను ఒంగోలు నగర కార్పొరేషన్‌లోని 1వ డివిజన్ నుంచి 15వ డివిజన్ వరకు క్లస్టర్ ఇన్‌చార్జిగా నియమించడంతో శుక్రవారం ఆయనను పలువురు సన్మానించారు. తనకు పదవి ఇచ్చినందుకు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డికి అంకయ్య కృతజ్ఞతలు తెలిపారు. ముక్తినూతలపాడు, కేశవరాజుకుంట, 2వ డివిజన్లో, బీసీ నాయకులు అంకయ్యను ఘనంగా సన్మానించారు. తొలుత వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి అంకయ్య నివాళులర్పించారు. సూదనగుంట రామకృష్ణ, దాసు వెంకట్రావు, లోకేష్, రఘుపతి, ఎస్కే హజరత్, ఎస్కే సిద్దయ్య, పాకల కృష్ణ, అనిల్, రాయపాటి వెంకటేశ్వర్లు, వినోద్ పాల్గొన్నారు.